సందడిగా 'కార్తీక' వనభోజనాలు



వృద్ధులను సన్మానిస్తున్న జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



వన మహోత్సవానికి హాజరైన వృద్ధులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కార్తీక వన భోజన కార్యక్రమం సందడిగా జరిగింది. సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రతియేటా లాగా నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో వయోవృద్ధులు తమ అనుభవాలను పంచుకున్నారు. పదవీ విరమణ తర్వాత తాము చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి పలువురు ఈ వేదికపై తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరుపున చేపట్టిన, చేపడుతున్న వివరాలను ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు వివరించారు. అలాగే 75 ఏళ్లు పైబడిన 15 మంది వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి మాట్లాడుతూ జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు ప్రతియేటా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ సారి కూడా జరిగే పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలను బాల్‌రెడ్డి, జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, సీనియర్ సిటిజన్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, జాయింట్ సెక్రటరీ బాషా, కోశాధికారి ఓఎస్‌ఆర్ రెడ్డిలతో పాటు అనంతరెడ్డి, విశ్వనాథరాజు, నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, పాండురంగారావు, ఎంఎస్‌ఆర్ మూర్తి, వేణుగోపాలరావు, నర్సయ్య, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కథ సుఖాంతం



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వెలుగు చూసిన బాలుడి అదృశ్యం ఉదంతం శనివారం రాత్రి సుఖాంతమైంది. అదృశ్యమైన ఐదేళ్ల బాలుడు బోయిగూడలో ప్రత్యక్షమవడంతో పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. చేరదీసిన బాలుడిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించిన రైల్వే పోలీసులు కిడ్నాపర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ తెలిపిన మేరకు.. నిజామాబాద్‌కు చెందిన అనిల్ కుమార్ ఉపాధి కోసం నగరానికి వచ్చి గుడి మల్కాపూర్‌లో నివాసం ఏర్పాటు చేసుకుని కూలీ పనులు చేసుకుంటున్నాడు. నిజామాబాద్‌లో అనిల్‌కుమార్ సమీప బంధువు ఈనెల 14న మతిచెందాడు. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనిల్ కుమార్ తన ఐదేళ్ల కుమారుడిని వెంట తీసుకుని అదేరోజు నిజామాబాద్ వెళ్లాడు. అక్కడ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 15న తెల్లవారుజామున నిజామాబాద్ నుంచి రాయచూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.

నిద్ర లేచేసరికి అదృశ్యం

మరీ తెల్లవారు జామున సిటీ బస్సులు అందుబాటులో ఉండవని భావించిన అనిల్‌కుమార్ తన కుమారుడితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 1లో రైలు దిగగానే పడుకున్నారు. కొద్ది గంటల తరువాత అనిల్‌కుమార్ లేచిచూసే సరికి తన పక్కనే పడుకున్న కుమారుడు కనిపించలేదు. రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు కొడుకు ఆచూకీ కోసం వెదికిన తండ్రి చివరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించాడు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు సీసీ ఫుటేజీలను తనిఖీ చేశారు. బాలుడిని ఒక గుర్తుతెలియని వ్యక్తి వెంట తీసుకెళుతున్నట్లు గుర్తించారు. బాబును తీసుకెళ్ళిన వ్యక్తి కోసం ప్రత్యేక బందాలుగా ఏర్పడిన రైల్వే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

రైల్వేస్టేషన్‌లో కిడ్నాప్.. బోయిగూడలో ప్రత్యక్షం

- నిద్రిస్తున్న బాలుడిని తీసుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి
- కేసు ఛేదించిన పోలీసులు..
- కిడ్నాపర్ కోసం గాలిస్తున్న రైల్వే పోలీసులు

ఒక్కడే తిరుగుతుండటంతో..

రైల్వేస్టేషన్ నుంచి అదశ్యమైన బాలుడి కోసం, కిడ్నాపర్ కోసం గంటల తరబడి రైల్వే పోలీసులు గాలింపు చర్యలు నిరాటంకంగా కొనసాగిస్తున్న సమయంలోనే బోయిగూడ ప్రాంతంలో బాలుడు ఉన్నట్టు సమాచారం అందింది. ఐదేళ్ల బాలుడు ఒక్కడే తచ్చాడుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాలుడిని పోలీసులు చేరదీశారు. ఇదిలా ఉండగా కిడ్నాపర్ తాను వెంట తీసుకెళ్లిన బాలుడిని బోయిగూడ ప్రాంతంలో వదిలేసి ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. రైల్వేస్టేషన్ నుంచి సదరు బాలుడిని బయటకు తీసుకెళ్లిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.23, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 26, క్యారెట్ 65, దొండ 23, గుండుబీన్స్ 53, గింజ చిక్కుడు 60, గోకరకాయ 28, కీర 17, దోసకాయ 37, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను అందజేసిన నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు..

సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని సనత్‌నగర్ (ఓల్డ్) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సైకిళ్లను పంపిణీ చేసింది. 2023–24 విద్యా సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ చూపిన 23 మంది విద్యార్థులకు సైకిళ్లను శనివారం ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభను చాటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

చెత్త డంపింగ్ యార్డును తరలించాలి



చెత్త డంపింగ్‌యార్డు తొలగించాలని నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రసూల్‌పురా: తిరుమలగిరి కమ్యూనిటీహాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును తరలించాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళి ముదిరాజ్ హెచ్చరించారు. కంటోన్మెంట్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్ కృషితో నిధులు విడుదల కావడంతో వారి చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ .. ఉన్న కమ్యూనిటీ హాల్ ఆవరణకు ఆటోల్లో, లారీల్లో చెత్తను తరలిస్తున్నారని దీంతో టన్నుల కొద్ది చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డుగా మారిందన్నారు. లాల్‌బజార్, శాస్త్రీనగర్, మలాని కాలనీతో పాటు పరిసర బస్తీలు పేరుకుపోతున్న చెత్త కారణంగా అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. పదిరోజుల్లో డంపింగ్‌యార్డు తరలించని పక్షంలో ప్రజలతో కలసి దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు, అశోక్, కార్తీక్ రాము, విజయ్, వైష్ణవి చాముండేశ్వరి, అమిత్, సాయన్న పాల్గొన్నారు.

ఓయూ ఏబీవీపీ ముఖ్య నేతల ముందస్తు అరెస్టులు

ఉస్మానియా యూనివర్శిటీ: చలో బాసర పిలుపును విఫలం చేసేందుకు ఓయూ ఏబీవీపీ ముఖ్య నాయకులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్ట్ చేశారు. శనివారం తెల్లవారు జామున 2 గంటలకు పగిడిపల్లి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు. తెలంగాణ ఆల్ వర్సిటీస్ కన్వీనర్ జీవన్‌ను నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేయగా పృథ్వీ తేజాను సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలులో అరెస్ట్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి జాన్సీతో పాటు మరో 9 మంది ప్రధాన నేతలను అరెస్ట్ చేశారని జీవన్ తెలిపారు.

భిక్షాటన చేస్తూ ఆటో డ్రైవర్ల నిరసన



తార్నాకలో నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆటో డ్రైవర్ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సంఘాల జేఏసీ నేతలు మాట్లాడుతూ ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని గత నాలుగు రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఈ ప్రభుత్వానికి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో మహిళలంతా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ తమ ఉపాధిపై దెబ్బపడిందన్నారు. ఆటో సంఘాల జేఏసీ నాయకులు కొమరయ్య యాదవ్, పల్లేర్ల రవి, సాయిలు, హరిబాబు, కుమార్ బాయి, ఈశ్వర్ పాండే గౌడ్ తదితరులున్నారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌ను కలిసిన అధ్యాపకులు



లాలాపేట: ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవలే నూతనంగా నియమితులైన ప్రొఫెసర్ కాశీంను శనివారం ఉస్మానియా యూనివర్సిటీ మాదిగ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ బృందం మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం అందజేసి ప్రొ.కాశీంకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తేల్లూరి, డా. సూరేపల్లి వెంకటరత్నం,డా. పాలడుగు జీవన్, దుబ్బ రంజిత్, యుగంధర్, అజయ్ తదితరులున్నారు.

విద్యార్థుల ఆందోళన



కళాశాల భవనం ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం పెడుతున్నారంటూ శనివారం నిరసన వ్యక్తం చేస్తూ కళాశాల ఆవరణలో ఆందోళన చేశారు. వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా హాస్టల్లో సరైన భోజన వసతులను కల్పించకుండా కల్తీ ఆహారంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల భవనం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న బేగంపేట పోలీసులు కళాశాలకు చేరుకుని విద్యార్థు లను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వైస్ ప్రిన్సిపల్ మృదుల లక్కరాజు, ప్రొ. ప్రసాద్, పోలీసులు విద్యార్థులతో చర్చించి నాణ్యతతో కూడిన ఆహారం అందజేస్తామని హామీవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

వినికిడి సమస్యలపై ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, మా ఈఎన్‌టీ ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో సికింద్రాబాద్, నల్లగుట్ట బాలంరాయి పాఠశాలలో వినికిడి సమస్యలపై వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది సుమారు 200 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఎన్ హనుమంతురావు, రొటేరియన్ కుమారస్వామి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా సదర్ ఉత్సవాలు



చిలకలగూడ మైదానంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల దృశ్యం

చిలకలగూడ: డప్పు చప్పుళ్లు, యువత నృత్యాలు, అందంగా అలంకరించిన దున్నపోతుల విన్యాసాలతో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. యాదవులు నిర్వహించిన వేడుకల్లో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆకర్షణీయమైన దున్నలు విన్యాసాలతో సందడి చేశాయి. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. సీతాఫల్‌మండి, మెట్టుగూడ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పద్మారావును కలిసిన విద్యుత్ జేఏసీ ప్రతినిధులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ ఆర్టిసన్ జేఏసీ ప్రతినిధులు

సికింద్రాబాద్: తెలంగాణా విద్యుత్ ఆర్టిసన్ జేఏసీ ప్రతినిధులు శనివారం సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తో సమావేశమయ్యారు. సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ ను కలిసి తమ డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వారు ఒక వినతి పత్రాన్ని అందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



దూద్‌బావి పాఠశాల విద్యార్థినికి కళ్లద్దాలు అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రతినిధులు దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రతినిధి ప్రదీప్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి, అధ్యాపకులు మల్లీశ్వరీ, జకియాబేగం, నాగశృతి, హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప మాలధారులకు నిత్య అన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. డిసెంబరు 26 వరకు ప్రతిరోజు అన్నదానం కొనసాగుతుందని అయ్యప్ప స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆలయ ట్రస్టుబోర్డుతోపాటు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ట్రస్టుబోర్డు చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు దేవేందర్ యాదవ్, అమృత్, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజల చెంతకే సహజ ఉత్పత్తులు



మూలం సంతలో కొనుగోలు దారులతో నెలకొన్న సందడి

లాలాపేట: గ్రామభారతి, సీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో 5వ మూలం సంతను నిర్వహించారు. దీన్లో సుమారు 70 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సహజ సిద్ధమైన వ్యవసాయ, గోఆధారిత ఉత్పత్తులను, ఖాది వస్త్రాలు, పట్టణ వాసులకు అందుబాటులో ఉంచారు. ప్రకృతి నుంచి అందరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలనేదే ఈ మూలం సంత ప్రధాన ఉద్దేశ్యం అని గ్రామభారతి అధ్యక్షురాలు సూర్యకళ తెలియజేశారు.

కాంగ్రెస్ వల్లే నిధుల విడుదల



సీఎం రేవంత్‌రెడ్డి, పొన్నం, శ్రీగణేష్ చిత్రపటానికి పాలబిషేకం చేస్తున్న నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణ, పికెట్, హస్మత్‌పేట నాలాల అభివృద్ధి పనులకు నిధులు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కృషితో విడుదలయ్యాయని శాంసన్ రాజు ఆధ్వర్యంలో రసూల్‌పురా కంగాల్ చౌరస్తాలో వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఎంపీ ఈటేల రాజేందర్ కృషితో కేంద్రం ద్వారా నిధులు విడుదలయ్యాయని రామకృష్ణ ప్రకటించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామకృష్ణ గత మూడేళ్ళుగా నామినేటెడ్ సభ్యుడిగా కొనసా గుతున్నప్పటికి బోర్డు పరిధిలో అభివృద్ధి జరగలేదన్నారు. వినోద్, ఇస్మాయిల్, షమి, యూసుఫ్, యాదగిరి, నాగేష్, ధనలక్ష్మి, యూసుఫ్ బీ, నాగరాజు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.కాశీంకు పలువురి అభినందనలు

ఉస్మానియా యూనివర్శిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీంకు పలువురు అభినందనలు తెలిపారు. శనివారం ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తం, సివిల్స్ కోచింగ్ డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్ రావు, ఇతర అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రొ.కాశీంకు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ట్స్ కాలేజీకి తొలిసారి మాదిగ ప్రొఫెసర్‌ను ప్రిన్సిపల్‌గా నియమించడం పట్ల మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నాయకులు కొమ్ము శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

అధ్యాపకులు నిరంతరం అధ్యయనం చేయాలి



ప్రొఫెసర్ డీఏ పద్మావతిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రొఫెసర్ డాక్టర్ డీఏ పద్మావతి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: అధ్యాపకులు నిరంతరం అధ్యయనం చేసినప్పుడే విద్యార్థులకు సమగ్రమైన సమాచారాన్ని అందించగలుగుతారని ప్రొఫెసర్ డాక్టర్ డీఏ పద్మావతి అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఐదు రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవల్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో బోధన చేయాలన్నారు. నేటి పోటీ ప్రపంచంతో తట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్య ప్రతినిధులు పద్మావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రకంటి శంకర్, ప్రొఫెసర్ జయవెంకటేశ్వర, కామర్స్ విభాగం అధిపతి ఎల్‌ఎస్ కమల, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాయిస్ అండ్ స్పీచ్ వర్క్ షాప్ ప్రారంభం



రాంగోపాల్ పేట్: సురభి కళాక్షేత్రం ఆధ్వర్యంలో వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్ సికింద్రాబాద్ లోని అవర్ సాక్రెడ్ స్పేస్ ప్రాగణంలో శనివారం ప్రారంభమైంది. ప్రముఖ నాటక, దర్శక రచయిత గరికపాటి ఉదయభాను వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రముఖ వ్యాఖ్యాత, సీనియర్ అనౌన్సర్ అంబడిపూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



సనత్‌నగర్: కార్తీక మాస పూజలు వైభవంగా సాగుతున్నాయి. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు కొనసాగుతున్నాయి. స్వామివారు అలంకరణలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. అలంకరణలో భాగంగా శనివారం కొబ్బరి ఆకులతో అందంగా అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో కార్తీక పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి



ఏసీపీ ప్రసన్న లక్ష్మీతో తక్షశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

లాలాపేట: షీ టీమ్స్, భరోసా కేంద్రాలతో బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏసీపీ ప్రసన్న లక్ష్మీ అన్నారు. శనివారం శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్లో పోలీసుల వ్యవస్థ షీ టీమ్స్–మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో సంభాషణ చాలా ప్రమాదకరమని వివరించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల పనితీరును విద్యార్థులకు వివరించారు. వాటి సేవలను విద్యార్థులు ఏ విధంగా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న స్వదేశీ హస్తశిల్ప్ కళా ఎగ్జిబిషన్

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌నగర్‌లోని బాపునగర్ కమ్యూనిటీ హాల్‌లో స్వదేశీ హస్తశిల్ప్ కళా ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. దేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్స్, కాటన్ వస్త్రాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్ ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, ఆంధ్రప్రదేశ్ ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాం మూగా, ఎరిసిల్క్స్, బీహార్ బాగల్పుర సిల్క్స్, టస్సర్, చత్తీస్‌ఘడ్ ట్రిబిల్ వర్క్స్ కోసా సిల్క్స్, గుజరాత్ బాందని తదితర హ్యాండీ క్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే పాత కంచిపట్టు, బనారస్, గద్వాల్, వెంకటగిరి, పూనె, జరీ చీరలు ఇక్కడ కొనుగోలు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

అంబర్‌పేట: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రోత్సాహం అందిస్తామని అకాడమిక్ హైట్స్ కేంబ్రిడ్జ్ పాఠశాల రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో సైన్స్‌ఫేర్ నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు పలు అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు సన్నివేశాలను ప్రదర్శించి అబ్బుపరిచారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ట్విన్ సిటీస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వీఎస్‌టీ పార్కులో మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌తోపాటు గుండె సంబంధిత వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం ట్విన్ సిటీస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కందూరి కృష్ణ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, అందరూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు. తమ క్లబ్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్.గోవింద్‌రావు, పి.నాగభూషణం, మురళీధర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి రాజ్యాంగంపై అవగాహన శిబిరాలు

కాచిగూడ: రాజ్యాంగంపై అన్నివర్గాల ప్రజలకు పూర్తి అవగాహన పెంపొందించడానికి ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్ తెలిపారు. ఈ నెల 26న రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విశ్రాంత న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు ఈ శిబిరాలలో పాల్గొని రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. నవంబర్ 26న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.